నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 30 సెప్టెంబర్ 2024 | SURYAPET

## మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా

- సంగ్య తండా వాసుల తీర్మానం



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

తుర్కపల్లి, సెప్టెంబర్ 29 : గ్రామంలో మద్యం అమ్మకాలు నిషేధించాలని మండలంలోని సంగ్యతండా గ్రామస్తులు ఆదివారం తీర్మానించారు. దీనిని అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయిస్తే లక్ష రూపాయల జరిమానా చెల్లించాలని నిర్ణయించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ తండాలో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తుండడంతో గ్రామ ప్రజలతోపాటు యువత మద్యానికి బానిస అవుతున్నారన్నారు. దాంతో ఆర్థికంగా వెనుబడిపోయి కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని తీర్మానంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామ యువత పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయానికి వచ్చిన బాధిత కుటుంబాలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# అర్హులకు అందని వరద సాయం

## నష్టం ఒకరిది.. పరిహారం మరొకరికి

**రేషన్ కార్డు ఉన్న వారికే సాయం అంటున్న అధికారులు**

**ఆవేదనలో కోదాడ మండలంలోని బాధిత కుటుంబాలు**

**నామమాత్రంగా సర్వే చేయడంతోనే సమస్యలు**

కోదాడ రూరల్, సెప్టెంబర్ 29 : కోదాడ ప్రాంతాన్ని ముంచెత్తిన భారీ వానలు, వరదలకు అనేక మంది నష్టపోయారు. కొందరి ఇండ్లు పూర్తిగా కొట్టుకుని పోయి నిలువ నీడ లేకుండా ఉన్నారు. మరి కొందమంది ఇంటి సామగ్రి పూర్తిగా వరదకు కొట్టుకుని పోయి నిరాశ్రయులుగా మిగిలారు. బాధితుల గ్రామాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించి నష్టాలను అంచనా వేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ కోదాడ మండల అధికారులు బాధితుల వివరాల సేకరణలో పలు మెలికలతో పేర్లు నమోదు చేయకపోవడంతో అర్హులైన వారికి సాయం అందలేదు. దాంతో వరద బాధితులు ఆందోళనలు, నిరసనలకు దిగారు. గురువారం అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన వారు, శుక్రవారం కోదాడ మండల పరిధి కూచిపూడి గ్రామానికి చెందిన వారు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రేషన్ కార్డు ఉంటేనే వరద సాయం వస్తుందని, లేకుంటే రాదని అధికారులు చెప్తున్నారు. దీంతో కార్డులు లేని వారు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


కోదాడ పట్టణం సాయినగర్‌లో వరదకు పూర్తిగా మునిగిన ఇంటి యాజమానికి అందని సాయం


కోదాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కూచిపూడి వరద బాధితులు (ఫైల్)

### పూర్తిగా సామాన్లు తడిచినా..

కోదాడ పట్టణంలో సైతం వరద ఇండ్లను ముంచెత్తడంతో ఎంతో మంది నష్టపోయారు. పైఅంతస్తులో బిక్కు,బిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడిపారు. కొందరు లైఫ్‌బోట్ల సహాయంతో బయటపడ్డారు. కానీ అలాంటి వారికి సాయం అందలేదు. పట్టణంలోని సాయినగర్‌లో ఓ కుంటుంబ పూర్తిగా ఇల్లు నీట మునగడంతో తెల్లవార్లు ఇంటిపైనే గడిపారు. ఇంట్లోని వస్తువులు పూర్తిగా తడిచిపోయాయి. ఆ కుటుంబానికి సైతం వరద సాయం అందలేదు. వరద వచ్చిన తర్వాత మూడు నాలుగు రోజులకు సర్వేకు వచ్చిన అధికారులు, నాయకులు, ఇతరులు చెప్పిన ప్రకారమే పేర్లు నమోదు చేసుకున్నారని, అసలైన బాధితులను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

### రేషన్ కార్డు లేదని నిత్యావసర సరుకులు ఇవ్వలేదు



నా ఇల్లు ఊర్లోని అంతర్‌గంగా వాగు సమీపంలో ఉండటంతో వరద ఇంటిని ముంచెత్తింది. మా ఇంటిలోని సామాన్లతోపాటు ద్విచక్రవానం నీళ్లలో కొట్టుకుని పోయాయి. అధికారులు నాకు రేషన్ కార్డులేదని బాధితుల జాబితాలో పేరు రాయలేమని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన వరద సాయం లేకపోగా నిత్యావసర సరుకులు సైతం ఇవ్వలేదు. ఇప్పటికైనా పత్రాలు, రేషన్ కార్డులు కాకుండా బాధితులకు న్యాయం చేయాలి.

**-నందిగామ యేసురాణి, కూచిపూడి, కోదాడ మండలం**

### అర్హులందరికీ సాయం అందించాలి



వరదలకు కూచిపూడి గ్రామంలో సుమారు 300 ఇండ్లకుపైగా వరద నీరు చేరి ప్రజలు నష్టపోయారు. అధికారులు 293 మంది పేర్లు నమోదు చేశారు. ఇంకా సుమారు 50 నుంచి 60 మంది అర్హులైన వరద బాధితులకు పరిహారం అందలేదు. నడి ఊర్లో ఉన్న నష్టపోని వారికి ప్రభుత్వ సాయం అందించారు. అధికారులు ఇష్టారాజ్యంగా కాకుండా నిజమైన బాధితులను గుర్తించాలి. అందుకు మరోసారి సర్వే జరిపించాలి.

**- శెట్టి సురేశ్‌నాయుడు, కూచిపూడి మాజీ సర్పంచ్**

# అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

## ప్రజల పక్షాన పోరాడేది బీఆర్‌ఎస్ మాత్రమే

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తున్నది
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట క్యాంపు కార్యాలయానికి వచ్చిన చెరువుల పరిధిలోని వందలాది కుటుంబాలు
- హైడ్రా భయం వద్దు.. పేదలకు అన్యాయం జరుగనివ్వనని హామీ

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 29 : పేదలకు అండగా ఉంటాం.. ఎవరూ అధైర్య పడొద్దని.. ప్రజల పక్షాన పోరాడేది బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా సూర్యాపేట జిల్లాకు రావడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఆదివారం సూర్యాపేటలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చారు. వందలాది కుటుంబాలు రావడంతో వారందరినీ ఒక్క దగ్గర కూర్చోబెట్టి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి భరోసా కల్పించారు.భయాందోళనలు వద్దని, కొట్లాడుదామని.. ప్రజల జీవితాలతో ఆడుకుంటామంటే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజల పక్షాన పోరాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని, తన ప్రాణం పోయినా ప్రజలకు అన్యాయం జరుగనివ్వనని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్ల పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రజలకు అండగా ఉంటే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల జీవితాలతో ఆడుకుంటున్నాడని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమాలు మరిచిన కాంగ్రెస్‌కు ప్రజల్లో తిరుగుబాటు తప్పదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కన్నీళ్లు పెట్టించడం మానుకోవాలని తెలిపారు. ఎప్పుడేం జరుగుతుందోనని నిద్రాహారాలు మాని ఎదురు చూస్తున్న తమ వద్దకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వచ్చి ధైర్యం చెప్పడంతో భయాందోళనలు వీడి ప్రశాంతంగా ఉన్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. తమ కష్టాలు తెలుసుకొని అండగా ఉంటామన్నారని, ఆయనకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్ తాహేర్‌పాషా, నాయకులు అంగిరేకుల నాగార్జున, బత్తుల రమేశ్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్

# రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి రాక్షస పాలన

- ఆరు గ్యారెంటీలు గాలికి... హైడ్రా తెరపైకి
- నాటి 60 ఏండ్ల పాలన.. 9 నెలల్లోనే పునరావృతం
- ప్రెస్ మీట్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, సెప్టెంబర్ 29 : రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి రాక్షస పాలన కొనసాగుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి, డబ్బులు దండుకోవాలనే దుర్బుద్ధితో హైడ్రాను తెరపైకి తీసుకొచ్చారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఉన్న పరిస్థితులే ఈ 9 నెలల్లో పునరావృతమవుతున్నాయన్నారు. మహిళలకు రూ.2,500 రూపాయలు ఇస్తానని చెప్పి ఇప్పటివరకూ ఏ ఒక్కరికీ ఇవ్వలేదని, గ్యాస్ సిలిండర్‌పై రాయితీ ఎక్కడని, ఉచిత కరెంట్ కోసం ఆఫీసుల చుట్టూ ఇంకా ఎంత మంది తిరుగుతున్నారో తెలుసా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టే ప్రసంగాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఇస్తానన్న ఎలక్ట్రికల్ వాహనాలు ఎక్కడ అని అన్నారు. మనకు రావాల్సిన సాగునీటిని ఆంధ్రాకు పంపిస్తున్నాడని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు, ఇప్పుడు జరుగుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. దాదాపు 40 నుంచి 50 సంవత్సరాలుగా నివాసముంటున్న ఇండ్లను హైడ్రా పేరిట కూల్చుతున్నారని, రేవంత్‌రెడ్డికి పేదల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ స్టేషన్లు వేదికగా భూ దందాలు, సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో పోలీస్ స్టేషన్‌కు పంచాయతీలొస్తే కప్పం కట్టి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రుణమాఫీ కాని రైతులు ఇంకా కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేతకాకపోతే రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలన వద్దు, కేసీఆర్ పాలన ముద్దు అని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూలుస్తామంటే ఊరుకోబోమని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ పెండెం సదానందం, మాజీ ఎంపీటీసీ రాచకొండ వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, కౌన్సిలర్ పల్లె విజయ్ పాల్గొన్నారు.

# పుట్టం‘గండ్లు’

## నాటి నాణ్యత లోపాలే.. ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకు శాపాలు

**గుండెకాయం లాంటి సిస్టర్న్‌ను వెంటాడుతున్న అసంపూర్తి నిర్మాణాలు**

**సమైక్యపాలనలో పట్టింపులేకనే నేడు ఈ దుస్థితి**


కూలడానికి సిద్ధంగా ఉన్న మిగతా ప్యారా ఫిట్ వాల్

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబర్ 28 : నల్లగొండ జిల్లాతోపాటు హైదరాబాద్ జంట నగరాల ఆశల సౌధం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి సిస్టర్న్‌ను నాణ్యత లోపాలు వెంటాడుతున్నాయి. నిర్మాణం సమయంలో సమైక్య పాలకుల పర్యవేక్షణ లోపంతో నాసిరకంగా పనులు చేపట్టారు. దాంతో తరచుగా లీకేజీలతో పాటు ఇతర నిర్మాణాలు ధ్వంసమవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మించి 25 సంవత్సరాలలోనే ఒక్కొక్కటి శిథిలమై ఇరిగేషన్ అధికారులను కలవరపెడుతున్నాయి. అప్పటి కాంగ్రెస్ హయాంలోనే నాణ్యత లోపాలు పూర్తి స్థాయిలో బయట పడ్డా తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకున్నారే తప్ప శాశ్వత మరమ్మతులు చేపట్టలేక పోయారు. దీంతో జిల్లాకు సాగు, తాగునీటితోపాటు జంటనగరాలకు తాగునీరు అందింజే ఆశల సౌధంపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

### 1988లో ప్రారంభం

సాగర్ వెనుక జలాల నుంచి ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకంగా పుట్టంగండి వద్ద ఎస్‌ఎల్‌బీసీ నామకరణ చేసి 1988లో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ తర్వాత 2001 సెప్టెంబర్‌లో చంద్రబాబు నాయడు మోటర్లను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కృషి చేయడంతో దీనికి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ)గా మార్చారు. ఇందులో భాగంగా పుట్టంగండి పంపుహౌజ్ నుంచి 80 మెగావాట్ల హెచ్‌పీ సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్ల ద్వారా 200 ఫీట్ల ఎత్తులోకి ఎత్తిపోసేందుకు రెండు గుట్టల నడుమ సిస్టర్న్‌ను 2.2 కిలోమీటర్ల పొడవునా 0.30 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. అప్పుడు నిర్మాణం చేపట్టిన కంపెనీ నిర్లక్ష్యంతో పనులు చేయడంతో ప్రాజెక్టు ప్రారంభించిన పది సంవత్సరాలలోపే నాణ్యత లోపాలు బయట పడ్డాయి. సిస్టర్న్ ఇన్‌టెక్ స్ట్రక్చర్ నుంచి రోజురోజుకూ సీపేజీ నీరు పెరుగడంతో ఇన్‌టెక్ స్ట్రక్చర్ కూడా పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో పక్కనే ఆనుకున్న రెండు గుట్టల నడుమ నిర్మించిన మట్టికట్ట కూడా కుంగి పోవడంతో తాత్కాలికంగా మట్టికట్టను వెనుక నుంచి ధృడ పర్చారు. అప్పటీ జేపీ కంపెనీ ప్రతినిధుల సూచనమేరకు ర్యాక్ ఫిల్ డ్యామ్ ఏర్పాటు చేశారు. ఇన్‌టెక్ స్ట్రక్చర్ నుంచి పెద్ద ఎత్తున సీపేజీ వాటర్ బయటకు రావడంతో తాత్కాలికంగా గ్రౌటింగ్ ( సిమెంట్ లోపలికి పంపించడం) చేపట్టారు. దీంతో నాలుగు మోటార్లు నడిపితే సిస్టర్న్ ప్రమాదమని హెచ్చరిచడంతో మూడు మోటార్లు కొద్ది రోజుల పాటు నడిపించారు. దీంతో పాటు కట్టకు ఒక వైపు నిర్మించిన ప్యారా ఫిట్ వాల్ 1.7 కిలో మీటర్ల వద్ద గతంలో 40 మీటర్ల పొడవునా పడిపోగా తాజాగా 1 కిలోమీటర్ల వద్ద 50 మీటర్ల పొడవునా పూర్తిగా పడిపోయింది. కట్టకు రక్షణగా ఉండాల్సిన గోడ కూలి లోపలి భాగంలో పడిపోవడంతో నీటి ఒత్తిడికి మట్టి కట్టపై భారం పడుతుంది. ముఖ్యంగా గతంలో మట్టి కట్ట ప్రమాదకరంగా మారిన ప్రదేశంలో ప్యారాఫిట్ వాల్ కూలిపోవడంతో తక్షణమే అధికారులు చర్యలకు దిగారు. శాశ్వత మరమ్మతులకు సమయం పడుతున్న నేపథ్యంలో శనివారం నుంచి ఇరిగేషన్ ఉన్నతాధికారులు తాత్కాలికంగా మట్టిని బస్తాలలో నింపి కూలిన ప్రదేశంలోఅడ్డుగా వేస్తున్నారు. కానీ ప్రస్తుతం పడిపోయిన ప్యారాఫిట్ వాల్ గతంలో మట్టి కట్ట దెబ్బతిన్న ప్రాంతంలో కావడంతో త్వరితగతిన మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుందని అధికారుల భావిస్తున్నారు. తిరిగి శాశ్వత మరమ్మతులకు అంచనాలు రూపొదించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఏదైమైనా ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకమైన ఏఎమ్మార్పీ సిస్టర్న్ రోజురోజుకు నాణ్యత లోపాలతో శిథిలం కావడం భవిష్యత్తులో ప్రాజెక్టు మనుగడే ముప్పు అని నిపుణులు భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రాజెక్టుపై చొరవ చూపి శాశ్వత మరమ్మత్తుల దిశగా అడుగులు వేయాల్సి ఉంది.


ఏఎమ్మార్పీ ఇన్‌టెక్ స్ట్రక్చర్ నుంచి వెళ్తున్న సీపేజీ వాటర్

# గుట్టలో తుది దశకు దేవస్థాన బస్సు ప్రాంగణం

## కొండ కింద నిర్మాణం.. ఇక్కడి నుంచి గుట్టపైకి బస్సులు


కొండకింద నూతన దేవస్థాన బస్సు ప్రాంగణం

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 29 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కొండపైకి బస్సు వెళ్లేందుకు భక్తుల కోసం ప్రత్యేక దేవస్థాన బస్సు ప్రాంగణం నిర్మిస్తున్నారు. స్వామివారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండకింద బస్టాండ్ పక్కనే దేవస్థానం ఆధ్వర్యంలో బస్సు దీనిని నిర్మిస్తుండగా ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతావి పురోగతిలో ఉన్నాయి. వైటీడీఏ రూ. 8.79 కోట్లతో 2 ఎకరాల్లో నిర్మించే బస్టాండ్‌లో 10 ఫ్లాట్‌ఫామ్‌లు, 2 టికెట్ కౌంటర్, 2 ఏటీఎం సెంటర్లు, 5 షాపులు, క్లాక్ రూమ్, ఎగ్జిట్ లాబీ, కామన్ వెయిటింగ్ ఏరియా, స్త్రీలు, పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు, ఇన్‌చార్జి రూము నిర్మించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి స్వామివారి కొండపైకి వెళ్లేందుకు ప్రత్యేకంగా నిర్మించే దేవస్థాన బస్సు ప్రాంగణం వద్దకు రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో నడిపే బస్సుల్లో కొండపైకి చేరుకుంటారు.

# హాలియా మున్సిపాలిటీ ఖజానా ఖాళీ

## రెండు నెలలుగా సిబ్బందికి జీతాలు లేవు

**అర్థాకలితో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు**

**పాలకవర్గం మారిన తర్వాత ఇష్టారాజ్యంగా పనులు**

**హాలియా మున్సిపాలిటీలో ఖజానా ఖాళీ అయ్యింది. రెండు నెలలుగా మున్సిపాలిటీలో పని చేసే సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. దాంతో పారిశుధ్య కార్మికులు అర్థాకలితో పనిచేస్తున్నారు. కార్మికులు నెలనెలా ఇవ్వాల్సిన సబ్బులు, కొబ్బరి నూనె, బెల్లం, మాస్కులు కూడా లేవు. పీఎఫ్, ఈఎస్‌ఐ కూడా కార్మికుల ఖాతాలో జమ చేయడం లేదు.**

– హాలియా, సెప్టెంబర్ 29



హాలియా మున్సిపాలిటీ

### గతంలో భాగానే ఉన్నా...

హాలియా పట్టణం దినదినాభివృద్ధి చెందుతున్నది. పరిపాలన సౌలభ్యం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 లో గ్రామ పంచాయతీగా ఉన్న హాలియాను శివారు ఇబ్రహింపేట గ్రామ పంచాయతీని కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. 2021 జనాభా లెక్కల ప్రకారం హాలియా మున్సిపాలిటీ జనాభా 17,371 కాగా ప్రస్తుతం 20 వేల పైచిలుకు చేరింది. మున్సిపాలిటీలో 5,300 అవాసాలు ఉన్నాయి. గత ప్రభుత్వం 2019లో ఎన్నికల నిర్వహించగా 2020 జనవరిలో కొత్త పాలక వర్గం కొలువుదీరింది. 2021 నుంచి 2023 వరకు మున్సిపాలిటీ సజావుగానే సాగింది. గడిచిన నాలుగేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హాలియా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.60 కోట్లు విడుదల చేసింది. అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వసతి, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డు ఏర్పాటు, డిజిటల్ లైబ్రరీ, ఆడిటోరియం, గిరిజన సంక్షేమ భవన్, ఇండోర్ స్టేడియం, వైకుంఠధామం, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ వంటి పనులు చేపట్టారు.

### కొత్త పాలకవర్గం వచ్చాక..

2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత చైర్మన్ వెంపటి పార్వతమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి హాలియా మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. కొత్త పాలకవర్గం అధికారంలోకి వచ్చాక హాలియా మున్సిపాలిటీ నిర్వహణ గాడి తప్పింది. మున్సిపాలిటీలో సలహాదారుల పెత్తనం ఎక్కువైందని సొంత పార్టీ పాలకవర్గ సభ్యులే ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో మున్సిపాలిటీలోని నిధులన్నీ ఖాళీ చేయడంతో గత రెండు మాసాలుగా మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. మున్సిపల్ సిబ్బందికి 2023 మే లో మేడే సందర్భంగా కార్మికులకు ఇచ్చిన రూ.1000 బోనస్ కూడా గత 16 నెలలుగా కార్మికుల ఖాతాలో జమచేయడం లేదు. పారిశుధ్య పనులు చేసే కార్మికులకు ప్రతి నెలా సబ్బుల బిల్లు, బెల్లం, కొబ్బరి నూనె ఇవ్వాల్సి ఉండగా అది కూడా లేదు. మాస్కులు, కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు కూడా ఇవ్వడం లేదు. దాంతో మున్సిపల్ కార్మికులు జీతాలు రాక అర్థాకలితో జీవనం సాగిస్తున్నారు. జీతాల విషయంపై మున్సిపల్ కార్మికులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు కూడా వినపత్రం అందజేశారు. కానీ స్పందన లేదు. వేతనంతో పాటు నెలనెలా పీఎఫ్, ఈఎస్ఐ కూడా కార్మికులు ఖాతాలో జమచేయక పోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.


తమకు వేతనాలు ఇప్పించాలని ఆగస్టులో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న హాలియా మున్సిపాలిటీ కార్మికులు (ఫైల్)

### ఇల్లు గడువడం లేదు



రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల మా ఇల్లు గడవడం లేదు. అర్థాకలితో పనికి వస్తున్నాం. మాకు సబ్బుల బిల్లు, బెల్లం, నూనె కూడా ఇవ్వడం లేదు. మా బాగోగుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్ని రోజుల ఇట్ల బతుకేది?

**-నర్సమ్మ, కార్మికురాలు, హాలియా**

### కార్మికులకు నెలనెలా వేతనాలు ఇవ్వాలి



కార్మికుల సంక్షేమాన్ని హాలియా మున్సిపాలిటీ పాలకవర్గం గాలికి వదిలేసింది. రెండు నెలలుగా మున్సిపాలిటీలో పని చేసే కార్మికులకు వేతనం ఇవ్వకపోవడం బాధాకరం. కార్మికులు అర్థాకలితో జీవిస్తున్నారు. సబ్బుల బిల్లు, బెల్లం, కొబ్బరి నూనె 15 నెలలుగా ఇవ్వడం లేదు. అక్టోబర్‌లో కార్మికులకు వేతనం ఇవ్వకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతాం.

**- అవుతా సైదులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు**